

హైదరాబాద్ వార్త

# ఉత్సవాలకు రెడీ..

**-నేటి నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు -కూడళ్లు, జంక్షన్ల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరణ**

**-ప్రారంభోత్సవాలు..శంకుస్థాపనలు..సాంస్కృతిక ప్రదర్శలు -ఈనెల 9వరకు కొనసాగనున్న ప్రజా సంబురాలు**

**హైదరాబాద్,నవంబర్ 30,ప్రభాతవార్త:** నగరం ప్రజాపాలన విజయోత్సవాలకు సిద్ధమైంది. నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు కొత్తందాలను సంతరించుకోనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నగరంలోని సెక్రటేరియట్ , అసెంబ్లీ, జీహెచ్ఎంసీ కార్యాలయాలతో పాటు వివిధ ప్రభుత్వ భవనాలు, జంక్షన్లు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో రాత్రివేళల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి. నెక్లెస్ రోడ్, ట్యాంక్బండ్ ప్రాంతాల్లో తెలం గాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. అలాగే నగరం లోని ముఖ్యమైన ప్రాంతాల్లో 5కే రన్ నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరాలు తదితర కార్యక్రమాలు నిర్వహించ నున్నారు. సేఫ్టీ కిట్స్, పీపీఈ కిట్స్ పంపిణీ చేయనున్నారు. అలాగే డిసెంబర్ 3న మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ రైజింగ్ పేరిట పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవం కానుంది. అలాగే హెచ్సిటీ ప్రాజెక్ట్ కింద రూ.5,942 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందులోకేబీఆర్ పార్కు చుట్టూ ఆరుజం క్షన్ల వద్ద నిర్మించనున్న మల్టీలెవల్ ఫ్లై ఓవర్లు, అండర్పాస్ పనులను సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.అలాగే 586 కోట్ల విలువైన ఎస్ఎన్డీపీ పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రూ.150 కోట్లతో జరిగిన సుందరీకరణ పనులకు, రూ. 17 కోట్లతో పూర్తయిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అలాగే మీరాలం, మియాపూర్ పటేల్ చెరువు, సఫిల్ గూడ, ఫతేనగర్, నాగోల్, ఖాజా కుంటల వద్ద ఆరు ఎస్టీపీలను ప్రారంభించనున్నారు. అలాగే ట్రాన్స్ జెండర్లను ట్రాఫిక్ వలంటీర్లుగా నియమించే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు.



**అంతేకాకుండా మాదాపూర్లో ఇందిరా మహిళాశక్తి బజార్ ప్రారంభోత్సవం.**

ట్యాంక్బండ్ వద్ద సెల్ఫీ పాయింట్, వివిధ ప్రాంతాల్లో ఫుడ్కోర్టులు, హస్తకళా స్టాల్స్, ఆర్ట్ గ్యాలరీలు ఏర్పాటు, మ్యూజికల్ ఫెస్టివల్స్, కల్చరల్ షోస్, సెలబ్రిటీలతో ప్రమోషనల్ షోస్, ఫ్లాష్ మాబ్ షోస్, డ్రోన్ షోస్, ఇతరత్రా ప్రదర్శనలు చేయనున్నారు.

# 3న జూపార్కు-ఆరాంఘర్ ఫ్లైఓవర్ ప్రారంభం

**చార్మినార్,నవంబరు 30 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలోని జూ పార్కు నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జిని డిసెంబరు నెల మూడవ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.ఇందుకు కావలసిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.పాతబస్తీలోని ట్రాఫిక్ సమస్య నివారణ కోసం దాదాపు మూడు సంవత్సరాలు క్రితం బహదూర్పురలోని నెహ్రూ జూలాజికల్ పార్కు రహదారి నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు నాలుగు కిలో మీటర్ల పొడవు, ఆరు లైన్ల వెడల్పుతో వంతెన పనులను ప్రారంభించారు. వంతెన పనులు పూర్తి కావటంతో డిసెంబరు నెల మూడవ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జూ పార్కు- ఆరాంఘర్ ఫ్లైఓవర్ ప్రారంభం కానున్నది. ఈ ఫ్లై ఓవర్ అందు బాటులోకి వస్తే హైదరాబాద్ పాతబస్తీలోని బహదూర్పుర,తాడ్బన్,బిఎన్కె కాలనీ,మోచీ కాలనీ, కాలాపత్తర్, రంజన్ కాలనీ, దానిమ్మ గుడిసెలు, మీరాలం వాటర్ ఫిల్టర్ ప్రాంతం, ,శాస్త్రిపురం, హసన్ నగర్,రాఘవేంద్రనగర్,ఏక్తా కాలనీ,శివరాం పల్లి,ఆరాంఘర్ చౌరస్తా ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు ఉండవు.కాగా శని,ఆదివారాలతో పాటు సెలవు దినాలలో జూ పార్కుకు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు.సందర్శకుల వల్ల జూ పార్కు,బహదూర్పుర రహదారులో విపరీతమైన రద్దీ ఏర్పడి ట్రాఫిక్ జామ్ అవుతుండేది. ఈ ఫ్లై ఓవర్ అందు బాటులోకి వస్తే జూ పార్కు పరిసర ప్రాంతాలలో వాహనాల రద్దీ ఉండదు.కాగా దాదాపు 736 కోట్ల రూపాయల వ్యయంతో జూ పార్కు- ఆరాంఘర్ ఫ్లై ఓవర్ పనులను 2021లో ప్రారంభించారు.పనులు నత్త నడకన కొనసాగటంతో ఫ్లైఓవర్ పనులు పూర్తి కావటానికి మూడు సంవత్సరాలు సమయం పట్టింది. వాహనాలు జూ పార్కు వద్ద ఫ్లై ఓవర్ వంతెన మీద ఎక్కితే ఆరాంఘర్ చౌరస్తా వరకు నాలుగు కిలో మీటర్ల పొడవు వరకు ప్రయాణం చెయ్య వచ్చును.బెంగుళూరు జాతీయ రహదారి కావటంతో బెంగుళూరు.మహబూబ్నగర్తో పాటు పలు ప్రాంతాలకు ప్రయాణం చేసే ప్రజలకు అదే విధంగా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లె హైదరాబాద్ నగరంలోని ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.కాగా ఇప్పటికే బహదూర్పుర పెట్రోల్ పంపు నుంచి జూ పార్కు సమీపం వరకు నిర్మించిన ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చిన విషయం విధితమే.



జూ పార్కు నుంచి ఆరాంఘర్ వరకు నిర్మించిన ఫ్లైఓవర్

# దివ్యాంగుల డిమాండ్లు పరిష్కరించాలి

**-డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ రాష్ట్ర నాయకుల డిమాండ్**

**ధర్నాచౌక్, నవంబర్ 30, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులపై నిర్లక్ష్యం వీడి, తక్షణమే డిమాండ్లను పరిష్కరించాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ (డిఎస్డి) రాష్ట్ర అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వి.భారతి, ఉపాధ్యక్షులు వెంకటేష్గౌడ్లు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్లో డిఎస్డి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో దివ్యాంగుల పింఛన్లు ఆరువేలకు పెంచాలని, పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలుచేయటంలో పూర్తిగా విఫలమయిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా దివ్యాంగులకు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా అమలుచేయకపోవటం దారుణమన్నారు. రాష్ట్రంలో దివ్యాంగులు 20లక్షలకు పైగా ఉన్నారని, దివ్యాంగులకు ప్రత్యేక శాఖను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల పరిరక్షణ చట్టం 2016 (ఆర్పిడబ్ల్యూడి) ప్రకారం దివ్యాంగులకు సకలాంగులతో సమాన స్థాయి కల్పించాలని గుర్తు చేశారు. దివ్యాంగుల పెన్షన్ నాలువేల నుండి ఆరు వేలకు పెంచాలని, దివ్యాంగులకు కేటాయించిన ఉద్యోగాల క్యాలెండర్ పద్ధతిలో భర్తీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను పటిష్టంగా అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించాలని, దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, రాష్ట్ర దివ్యాంగుల కమీషనర్ను, డైరెక్టర్ను దివ్యాంగులకు చెందిన వారినే నియమించాలని విజ్ఞప్తి చేశారు. మలక్పేట్ దివ్యాంగుల భవన్ ఆవరణలో బదిరుల ప్రభుత్వ కాలేజి, డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేసి, హాస్టల్ వసతులు కల్పించాలని కోరారు. సీఎం రేవంత్రెడ్డి ఇప్పటికైనా స్పందించి, దివ్యాంగుల పెన్షన్లు పెంచటంతో పాటు ఇతర సమ్యలను పరిష్కరించాలని, లేనిపక్షం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాకు తెలంగాణ వికలాంగుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కిరణ్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు వెంకట్రావ్ మున్నా, టిహెచ్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుత్తికొండ కిరణ్, విహెచ్పిఎస్ జాతీయ కోర్ కమిటీ ఛైర్మన్ గోపాల్, వైస్ ఛైర్మన్ అందె రాంబాబు, రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య, నాయకులు గౌని యాదగిరి, మహేష్, మెరుగు శివ హాజరై మద్దతు తెలిపారు. ఈ ధర్నాలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



ధర్నాలో నినాదాలు చేస్తున్న డీఎస్డీ నేతలు

# రోడ్డుపై వెలిసిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని ధర్నా

**- హైటెన్షన్, గ్రీన్ గ్రోత్ కారిడార్ను పరిరక్షించాలని డిమాండ్**

**నార్సింగి, నవంబర్ 30 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని గోల్డెన్ టెంపుల్ నుంచి వెంకటేశ్వర కాలనీకి వెళ్లే రహదారి మధ్యలో వెలిసిన అక్రమ నిర్మాణంను వెంటనే తొలగించాలని శనివారం వెంకటేశ్వర కాలనీ ప్రజలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు ఉపేంద్రనాథ్రెడ్డి మాట్లాడుతూ రోడ్డును ఆక్రమించుకొని వెలిసిన నిర్మాణం అధికారులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ రోడ్డుపై వెలిసిన అక్రమ నిర్మాణంను తొలగించాలని మణికొండ మున్సిపాలిటీ, హెచ్ఎండిఏ, హైడ్రా అధికారులను విజ్ఞప్తి చేస్తున్నామని వివరించారు. హైటెన్షన్ లైన్ కింద, గ్రీన్ గ్రోత్ కారిడార్ ప్రాంతాలను కబ్జాపాలు కాకుండా కాపాడాలని కోరుతున్నామన్నారు. ఈ రోడ్డుపై వెలిసిన అక్రమ నిర్మాణం వలన తామంతా కిలో మీటర్ దూరం అదనంగా తిరుగాల్సి వస్తుందని పేర్కొన్నారు. వెంకటేశ్వర కాలనీలోని పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, సెప్టిక్ ట్యాంకుల కోసం వదిలేసిన స్థలాలను కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని, సంబంధిత శాఖల అధికార గణం వీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలందరి ఉపయోగార్థం ఉన్న స్థలాలను కూడా కబ్జాలు చేసుకుంటూ పోతే ఎలా అని ప్రశ్నించారు. ఈ ఆక్రమణల పట్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రజలకు ఉపయోగపడేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కాలనీల ప్రజలు సైతం సమిష్టిగా ఇలాంటి అక్రమ నిర్మాణాల పట్ల గళం ఎత్తాలని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు ముందుకు రావాలని ఉపేంద్రనాథ్రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ఆందోళన కార్యక్రమంలో కాలనీ వాసులు సందీప్, జస్వంత్, అష్రఫ్, నాగరాజు, మల్లిఖార్జున్రెడ్డి, స్వప్న, సుజాత, రాధిక, పారిజాత, అనిత, నర్సిహ్మారెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.



మణికొండ గోల్డెన్ టెంపుల్ నుంచి వెంకటేశ్వర కాలనీకి వెళ్లే రోడ్డుపై వెలిసిన అక్రమ నిర్మాణంను తొలగించాలని ఆందోళన చేస్తున్న స్థానికులు

# పోలీసు శాఖకు అందించిన సేవలు మరువలేనివి

**- అధికారుల పదవీ విరమణ సభలో కమిషనర్ సివి ఆనంద్**

**పంజగుట్ట, నవంబర్ 30 ప్రభాతవార్త :** పదవీ విరమణ తర్వాత ఆరోగ్యకరమైన,సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి కుటుంబ సభ్యులు సహకరించాలని నగర పోలీసు కమీషనర్ సీవీ ఆనంద్ కోరారు.హైదరాబాద్ సిటీ కమీషనరేట్ పరిధిలో పదవీ విరమణ పొందుతున్న 12 మంది పోలీసు అధికారులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారుల. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు మీ పిల్లలను మంచి విద్యావంతులను చేయాలని,వారిని విదేశాలలో కూడా చదివిస్తున్నారని కొనియాడారు. చాలామంది పోలీసు పిల్లలు ఉన్నతమైన ఉద్యోగాలు చేస్తున్నారని అది నాకు చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు.మీ అపారమైన అనుభవం వృధాకాకుండా సమాజాభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. మంనం ప్రతిరోజూ ఏదోఒక పనిచేయడం వలన ఆరోగ్యంగా ఉంటామన్నారు. పదవీ విరమణ అనంతరం శేషజీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.మీరు పోలీసు శాఖకు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు.కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.శ్రీనివాస్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శంకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘంటసాల స్వరం తెలుగు సంగీతానికి వరం

**-శాసనసభాపతి గడ్డం ప్రసాద్కుమార్**



ఘంటసాల అవార్డుతో కోటి దంపతులను సన్మానిస్తున్న గడ్డం ప్రసాద్కుమార్, ముక్కంటేశ్వరరావు, దామోదర్గుప్తా తదితర అతిథులు

**రవీంద్రభారతి, నవంబరు 30 ప్రభాతవార్త :** తెలుగు సంగీత ప్రపంచంలో పద్మశ్రీ ఘంటసాలకు ఎవ్వరూ సాటిరారని, ఆయన కంఠం సుస్వరాల సుమధురమని, స్వరం తెలుగు సంగీతానికి వరం, స్వర్ణయుగం వంటిదని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అభివర్ణించారు.ప్రముఖ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డా. కొణిజేటి రోశయ్యను స్మరించుకుంటూ పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకొని శ్రీ వాసవి ఆర్ట్స్ ముక్కంటేశ్వరరావు నిర్వహణలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్గుప్తా సభాధ్యక్షతన జరిగిన ఘంటసాల గానామృతం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గడ్డం ప్రసాద్కుమార్ పలువురు ప్రముఖులతో కలిసి ప్రముఖ సినీసంగీత దర్శకుడు సాలూరి కోటి దంపతులను ఘనంగా సత్కరించి ఘంటసాల అవార్డును ప్రదానంచేసి శుభాకాంక్షలు తెలిపి ప్రసంగించారు. కోలేటి దామోదర్గుప్తా వాసవి తదితర సాంస్కృతిక సంస్థలకు అన్నివిధాలుగా అండగావుంటూ మంచి కార్యక్రమాలు జరపడానికి సహకారం అందిస్తున్నందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు.

# శేరిలింగంపల్లి సర్కిల్లో ఫుట్పాత్ల ఆక్రమణల తొలగింపు



ఫుట్పాత్లను తొలగించిన శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ప్లానింగ్ అధికారులు

**శేరిలింగంపల్లి,నవంబర్ 30 ప్రభాతవార్త**

ట్రాఫిక్కు తీవ్ర అంతరాయంగా మారుతూ.. వాహనదారులకు అసౌకర్యంగా ఉండే ఫుట్పాత్ల ఆక్రమణలపై శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక అధికారులు కొరఢా ఝుళిపించారు. కీలకమైన రహదారులలో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో శేరిలింగంపల్లి వెస్ట్జోన్ కమిషనర్ ఉపేందర్రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళికా విభాగం రంగంలోనికి దిగింది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సీటి బస్డిపో నుంచి గుల్మోహర్పార్క్ కూడలి వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేరకు ఫుట్పాత్లను ఆక్రమించి ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తున్న దాదాపు 40కిపైగా చిరు వ్యాపార సముదాయాలను అధికారులు తొలగించారు.ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తే సహించబోమని అధికారులు స్పష్టం చేశారు. ఇకపై ప్రతి శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించటం ద్వారా ఫుట్పాత్ ఆక్రమణలను తొలగిస్తామని శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళికా విభాగం ఏసీపి వెంకటరమణ తెలిపారు. కూల్చివేతల కార్యక్రమంలో టీపీఎస్ రవీందర్, షాన్ తదితరులు ఉన్నారు.

# ఎంపి అసదుద్దీన్ ఇంట్లో సర్వే..



కుటుంబవివరాలు ఎన్యూమరేటర్లకు అందజేస్తున్న ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

**హైదరాబాద్, నవంబర్ 30,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వేగంగా సాగుతోంది. సర్వేలో భాగంగా శనివారం నగరంలోని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఇంట్లో జీహెచ్ఎంసీ అధికారులు సర్వే చేశారు. శాస్త్రీపురంలోని ఎంపీ నివాసానికి వెళ్లిన అధికారులు, ఆయనను కలిసి వారి కుటుంబ సభ్యులు వివరాలతో పాటు ఇతర వివరాలు జోనల్ కమిషనర్ వెంకన్న సేకరించారు. సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ప్రశ్నలకు ఆయన సహకరించి వివరాలు నమోదు చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ మాట్లాడుతూ హైదరాబాద్ నియోజకవర్గ ప్రజలందరూ సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించి, వివరాలు ఇవ్వాలని సూచించారు.కార్యక్రమంలో రాజేంద్రనగర్ డిసి రవి కుమార్,వార్డు ఇంఛార్జి సయ్యద్,సూపర్వైజర్ ఉపేందర్,ఎన్యూమరేటర్ మాధమి పాల్గొన్నారు.

# వాస్తవికంగా లేని బడ్జెట్ ప్రతిపాదనలు...

**-స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల అసంతృప్తి**

**-ప్రతిపాదనలు, ఆదాయ వివరాలు తప్పుగా ఉన్నాయని ఆరోపణ**

**-సమావేశం వాయిదా ..9తర్వాత మళ్ళీ నిర్వహిస్తామని మేయర్ వెల్లడి**

**హైదరాబాద్, నవంబర్ 30, ప్రభాతవార్త:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీహెచ్ఎంసీ బడ్జెట్ ప్రతిపాదనలపై నిర్వహించిన ప్రత్యేక సమావేశం వాయిదా పడింది. అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలు, ఆదాయ వివరాలు వాస్తవికంగా లేవని బడ్జెట్పై మళ్ళీ సమావేశం కావాలని సభ్యులకు కోరడంతో మేయర్ సమావేశాన్ని వాయిదా వేశారు. ఈమేరకు శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్టాండింగ్ కమిటి ప్రత్యేక సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరమునకు రివైజ్డ్ బడ్జెట్, 2025-26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పై కమిటీ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఫైనాన్స్ అడిషనల్ కమిషనర్ గీతా రాధిక వివరణ ఇచ్చారు. ఈసందర్భంగా 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలకు సంబంధించి పలు అంశాల్లో బడ్జెట్ ప్రతిపాదనలు వాస్తవికంగా లేవని ఎస్టేట్, అడ్వర్టైజ్మెంట్ బడ్జెట్ ఆదాయం తక్కువ చూపించారని సభ్యులు ఆరోపించారు. తమ సూచనలు పరిగణలోకి తీసుకొని బడ్జెట్ ప్రతిపాదనలో మార్పులు చేసి తిరిగి సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. అలాగే బడ్జెట్ ముసాయిదా ప్రతిపాదనలు సకాలంలో అధికారులు అందించకపోవడం మూలంగా స్టడీ చేయలేకపోయామని సభ్యులు ఆరోపించారు. దీంతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి తిరిగి డిసెంబర్ 9 తర్వాత నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ... ఆదాయ వనరులు పెంచుకున్నప్పుడు జిహెచ్ఎంసి లో అభివృద్ధి పనులు కొనసాగుతాయని అన్నారు. జి.ఐ.ఎస్ సర్వే జోన్ వారిగా పూర్తయ్యిందని దాని ప్రకారం 24 లక్షలు గృహాలు ఉన్నాయని తెలియజేశారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, ఫాహెద్ బిన్ అబ్దుల్ సమద్ బిన్ అబ్దత్, మహమ్మద్ ఖాదీర్, మహమ్మద్ ముజాఫర్ హుస్సేన్, పొడవు అర్చన, రఫత్ సుల్తానా, మహమ్మద్ నసీరుద్దీన్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, మన్నె కవితా రెడ్డి, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, ఉప్పలపాటి శ్రీకాంత్, సబిహ బేగం, ఆవుల రవీందర్ రెడ్డి, చింతల విజయ్ శాంతి, కంది శైలజ, అడిషనల్ కమిషనర్లు గీతా రాధిక, నళిని పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, పంకజ, సరోజ, అశోక్ సామ్రాట్, రఘు ప్రసాద్, చంద్ర కాంత్ రెడ్డి, యాదగిరి రావు, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.



స్టాడింగ్ కమిటీ సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సభ్యులు

**కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని బిజెపి కార్పొరేటర్ల నిరసన...**

ఓవైపు స్టాండింగ్ కమిటీ సమావేశం జరుగుతుండగా బయట పలువురు బిజెపి కార్పొరేటర్లు నిరసనకు దిగారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి బల్దియను లూటీ చేస్తున్నారంటూ నినాదాలు చేశారు. అన్ని డివిజన్లలో పన్నులు వసూలు చేసి.. కేవలం ఓల్డ్ సిటీ అభివృద్ధి కి ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే అడ్వర్టైజ్మెంట్ డిపార్ట్మెంట్ లో 500 కోట్ల స్కామ్ జరిగిందని అయినా అధికారులు పట్టించుకోవట్లేదని ఆరోపించారు. అలాగే శానిటేషన్, అడ్వర్టైజ్మెంట్ కమిటీలు ఏర్పాటు చేసినా ఇప్పటికీ ఒక మీటింగ్ కూడా ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. వెంటనే కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటు చేసి నగర అభివృద్ధిపై చర్చించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మేయర్ వచ్చి బిజెపి కార్పొరేటర్లతో చర్చించి ప్రతి డివిజన్లో కమిషనర్తో కలిసి పర్యటించి సమస్యలపై చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో వారికి వినతిపత్రం అందించి నిరసన విరమించారు.



సమావేశ మందిరం బయట నిరసన తెలుపుతున్న బిజెపి కార్పొరేటర్లు

# గుంతల మయంగా రోడ్డు

## -వృద్దులు,చిన్నారులు,మహిళలకు ఇబ్బందులు


ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ కమ్యూనిటీ హాలు వద్ద గుంతలు ఏర్పడిన దృశ్యం.

**బేగంపేట నవంబరు 30,ప్రభాతవార్త**
బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ కమ్యూనిటీ హాలు వద్ద రోడ్డు గుంతల మయంగా మారడంతో వృద్దులు,మహిళలు,చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.వాహనాల రాక పోకల ధాటికి ఈ గుంతలు మరింత పెద్దగా మారడంతో బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.రాత్రి సమయంలో బస్సు దిగి బస్తీలోకి వచ్చే వృద్దులు పడిపోతున్నారని,బస్తీ వాసులు వాపోతున్నారు.గడచిన కొద్ది నెలలుగా బస్తీ కమ్యూనిటీ హాలు వద్ద గుంతలు మరింత పెద్దగా మారడంతో బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఇక్కడే మూల మలుపు కూడా ఉండటంతో మరింత ఇబ్బందిగా మారిందని వారు ఆరోపిస్తున్నారు.ఇదే ప్రాంతంలో చిన్నారులకు అంగన్‌వాడీ సెంటర్,రేషన్ దుకాణాలు కూడా ఉండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు.బస్తీలో ఏర్పడిన గుంతలతో చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు.ఇప్పటి కైనా అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి కమ్యూనిటీ హాలు వద్ద ఏర్పడిన గుంతలను పూడ్పించాలని,తమ ఇబ్బందులు తొలగించాలని ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ వాసులు కోరుతున్నారు.

# గాన ప్రతిభకు సినిమాలే అవసరం లేదు

## : సినీసంగీత దర్శకుడు కె.ఎం.రాధాకృష్ణ


గాయని సుజాతను ఎక్సలెన్సీ అవార్డుతో సత్కరిస్తున్న రాధాకృష్ణ, ప్రవీణ్, సింహ, పారిజాత తదితర అతిథులు

**నాంపల్లి, నవంబరు 29 ప్రభాతవార్త :** గాయకులు తమలోని గాన ప్రతిభను చాటుకోవడానికి సినిమా పాటలే అవసరం లేదని, ప్రోత్సహిస్తున్న ఎన్నో సాంస్కృతిక సంస్థలు, వేదికలను అందిపుచ్చుకొని ఖ్యాతిపొందాలని ప్రముఖ సినీసంగీత దర్శకుడు కె.ఎం. రాధాకృష్ణ సూచించారు. సీల్‌వెల్ కార్పొరేషన్, ప్రాజ్ఞిక ఫౌండేషన్, ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో సేవాసమ్రాట్ సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండి బండారు సుబ్బారావు శుభాశీస్సులతో ప్రాజ్ఞిక అధ్యక్షుడు, గాయకుడు ప్రవీణ్ నేతృత్వంలో ప్రముఖ గాయని సుజాత వర్ధమాన గాయకుల గళంలో 3గంటలపాటు నిర్విరామంగా సాగిన ఆణిముత్యాల్లాంటి జానకి సినీ తదితర గీతాలాపనలో నైటింగేల్ ఆఫ్ సౌత్ ఇండియా జానకమ్మ స్వరవైభవం ఆహుతులైన అశేష ప్రేక్షకులకు వీనులవిందుచేసి తన్మయుల్ని కావించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సినీసంగీత దర్శకుడు కె.ఎం.రాధాకృష్ణ, విశిష్ట అతిథులు సింహ, పారిజాత తదితరులతో కలిసి ప్రముఖ యువగాయని సుజాతను ఘనంగా సత్కరించి సీల్‌వెల్ ఎక్సలెన్సీ అవార్డును ప్రదానంచేసి అభినందించారు.

## ఆర్టీసి ఉద్యోగులు ఒకే కుటుంబంలా కలిసి ఉండాలి : ఆర్.ఎం.రాజశేఖర్


కంటోన్మెంట్ డిపోలో ఆర్టీసి ఉద్యోగులకు వనభోజనం చేస్తున్న ఆర్.ఎం.రాజశేఖర్ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 30 ప్రభాతవార్త:** ఆర్టీసి ఉద్యోగులు ఒకే కుటుంబం వలే కలిసి మెలిసి ఉంటూ సంస్థ మనుగడ కోసం పాటుపడాలని సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఎం.రాజశేఖర్ తెలిపారు. శనివారం కంటోన్మెంట్ డిపోలో నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దసరా, సంక్రాంతి, దీపావళి, క్రిస్మస్ వంటి పండగ రోజుల్లో ప్రయాణికులను వారివారి గమ్య స్థానాలకు చేర్చుందుకు ఆర్టీసి ఉద్యోగులు పండగలను లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్నామన్నారు. అదు వల్ల ఆర్టీసి ఎండి సజ్జనార్ అదేశాల మేరకు ఆర్టీసిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా తమ కుటుంబ ఎసభ్యులతో కలిసి వనభోజనాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ ఎసందర్భంగా ఉద్యోగుల చేత నిర్వహించిన డ్యాన్స్,క్యారమ్, పాటలు వంటి వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి ఉద్యోగులను సంతోషపర్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్.ఎం.బీమ్‌రెడ్డి, డిప్యూటీ సిపిఎం .వెంకట్‌రెడ్డి, డిపూ ్యటీ సీటీఎం.శ్రీనివాస్ రావ్, పర ్సనల్ ఆఫీసర్ భాస్కర్ రెడ్డి,డిపో మేనేజర్ సుధాకర్ రావ్, సిఐ.ట్రాఫిక్ శ్రీపతి క్రిష్ణ, అసిస్టెంట్ మేనేజర్ బాల్‌రాజ్, వెల్ఫేర్ బోర్డు సభ్యులు ఎస్.నాగరాజు,దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్


మమత హై స్కూల్ వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 30 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు టీచర్ల పాత్ర ఎంతో కీలకమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శనివారం సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో నిర్వహించిన మమతా హై స్కూల్ 38వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పిల్లలు చదువుతో పాటు శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడా రంగాల్లో కూడా ప్రతిభకనబర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ

**గన్‌ఫౌండ్రి,నవంబర్ 30 ప్రభాతవార్త:** జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ తల్లి లీలావతి జైస్వాల్ జ్ఞాపకార్థం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్బంగా గౌలిగూడ సిబిఎస్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిరుపేదలకు సుమారు 200వందల మందికి చల్లి దుప్పట్లను అందచేశారు. ఈసందర్బంగా ఆయనమాట్లాడుతూ ప్రతియేటా తన తల్లి జ్ఞాపకార్థం చల్లికావడంతోపాటు నిరుపేదలకు దుప్పట్లను అందచేయడం జరుగుతుందన్నారు.

# ఎస్సీరిజర్వేషన్ల వర్గీకరణపై మాదిగ ఉపకుల సంఘాల సమావేశం


ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై మాదిగ ఉప కుల సంఘాల మేధావులు,నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు.

**బేగంపేట నవంబరు 30 ప్రభాతవార్త**
రిజర్వేషన్ వర్గీకరణ కోసం రాజ్యాంగ ధర్మాసనం ఆగస్టు ఒకటో తేదీన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం వెలువ రించిన తీర్పును తాము స్వాగతిస్తున్నామని,మాదిగ ఉప కుల సంఘాల మేధావులు సమావేశంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు.డిశంబరు 14 లోగా ఏకసభ్య వర్గీకరణ కమీషన్‌కు విజ్ఞప్తులు పంపాలని మాదిగ ఎస్సీ,ఉపకులాల ంఘాల నాయకులు, ఉద్యోగులు,మేధావులకు సమావేశం పిలుపు నిచ్చింది.శనివారం బేగంపేట టూరిజం ప్లాజాలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై మాదిగ ఉప కుల సంఘాల మేధావులు,నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక కార్యదర్శి కృపాకర్ మాదిగ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం మంత్రి వర్గ ఉప సంఘం నియమించడాన్ని,వర్గీకరణ అంశాన్ని అధ్యయనం కోసం కొద్ది వ్యవధితో డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ కమీషన్ నియామకం పట్ల తమ సంఘాల తరుపున కృతజ్ఞతలు తెలియజేసారు.తెలంగాణా రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ ఛైర్మన్‌గా,రాష్ట్ర సర్వీస్ కమీషన్ మెంబర్‌గా ,ఉన్నత విద్యా మండలి కమీషన్ ఛైర్మన్‌గా రెండు వైస్ ఛాన్సిలర్ పదవులు,రాష్ట్ర విద్యాకమీషన్‌లో సభ్యత్వం,రాష్ట్ర విద్యా కమీషన్ సలహా మండలి సభ్యులుగా తమకు అవకాశం కల్పించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి తమ సంఘాల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వ వర్గీకరణ అనుకూల విధానానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు,వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకట్‌స్వామి,వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజులపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని తమ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు.ప్రతి షెడ్యూల్ కులానికి విద్య,ఉద్యోగ రంగాల్లో జనభా దామాషా ప్రకారం ఏక రూప అభివృద్ధి కోసం ప్రాధాన్యతలతో కూడిన అవకాశాలు పొందగలిగినపుడే ఎస్సీ కులాల మధ్య నిజమైన సామరస్యం ఐక్యత నెలకొంటుందని,వర్గీకరణకు వ్యతిరేకంగా పనిచేస్తున్న కొన్ని అసాంఘిక శక్తులను కట్టడి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.రిజర్వేషన్ల లో పంపిణీ న్యాయం కోసం మాల సోదరులంతా తమ సంఘాలతో కల్సి రావాలిని వారు విజ్ఞప్తి చేసారు.ఈ సమావేశంలో మాదిగ కుల సంఘాల మేధావులు,నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నాం


పాఠశాల వార్షికోత్సవాలకు ముఖ్యఅతిథిగా సెయింట్ జార్జ్ విద్యాసంస్థల ఛైర్మన్. మెదక్ జిల్లా చర్చ్ బిషప్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రుబెన్‌మార్క్,డాక్టర్ కె.పిరిసిల్ల పరిమళరుబెన్ మార్క్‌లు

**గోషామహల్,నవంబర్ 30ప్రభాతవార్త:** వంద సంవత్సరాల క్రితమే సెయింట్ జార్జ్ స్కూల్ యాజమాన్యాం బాలికల కోసం విద్య,బోధనలకు పాటు పడుతుందని మెదక్ ఇన్‌చార్జ్ బిషప్ డయోసిస్ రైట్ రేవ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రియోబిన్ మార్క్ పేర్కొన్నారు.అబిడ్స్‌లోని గ్రామర్ స్కూల్ ఆవరణలో సెయింట్ జార్జ్ స్కూల్ 190 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న సెయింట్ జార్జ్ విద్యాసంస్థల చైర్మన్,మెదక్ జిల్లాచర్చ్ బిషప్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రుబెన్ మార్క్,మాట్లాడుతూ తమ విద్యాసంస్థల విద్యార్థుల ప్రపంచస్థాయిలో ఉత్తమ శిఖరాలను ఆధిరోహించారన్నారు.నైటింగేల్ సరోజినాయుడుతోపాటు పలువురు ప్రముఖులను విద్యను అభ్యసించిన తమ విద్యాసంస్థల 190 సంవత్సరాల వేడుకలను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు విద్య ఎంత ముఖ్యమో, సమాజసేవలు, స్వయంగా పెంపొందడం,క్రీడలు,ఇతర రంగాలు కూడా అంతే ముఖ్యమన్నారు.బాలికల విద్య కోసం ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు.ప్రస్తుతం నేడు బేటి బచావో, బేటిపడావో ప్రచారం జరుగుతుందన్నారు.విద్యాతోపాటు మానవ విలువలు ఎంతో గొప్పవన్నారు.తమ విద్యాసంస్థల్లో మాత్రం నూరు శాతం కంటే ముందే ఈ నినాదాన్ని నేరవేర్చామన్నారు.మహిళలకు అధిక ప్రాధ్యానత ఇస్తూ మహిళా రంగానికి సెయింట్ జార్జ్ స్కూల్ పెద్దపీట వేసిందన్నారు.అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసినంతరం సావనీర్ క్యాలండర్ ఆవిష్కరణ 190 సంవత్సరాల సావనీర్ తోపాటు మెదక్ చర్చ్ 2025వ సంవత్సరం క్యాలెండర్‌ను ప్రముఖులు రైట్ రేవ్ ప్రొఫెసర్ డాక్టర్ రె.రియోబిన్ మార్క్,రేవ్ డాక్టర్ కె.ప్రెసిల్లా పర్విల్లారియోబిన్‌మార్క్,రేవ్ డాక్టర్ పి.సోలామాన్‌రాజ్,జి.ఈబర్ జయపాల్,జాన్ జనార్దన్,డాక్టర్ సత్యానందం,ఉదయ్‌కుమార్,మంనరతి సాలమాన్‌రాజ్,జి.ప్రభుకిరణ్,జయానంద్,స్పెషల్ ఆఫీసర్ ఆర్.సత్యానందం,ప్రిన్సిపల్ బి.రూత్‌లజ్వంతి,వార్డెన్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.విమల్ సుకుమార్లు ఘనంగా సత్కరించి,విద్యాసంస్థల ప్రగతిని వెల్లడించారు.

**-ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు...**
విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.బాలికలు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల తోపాటు విద్యార్దులు పాల్గొన్నారు.

# ఘనంగా సాంప్రదాయ దినోత్సవం


బసవన్న వేషదారణతో హాజరైన విద్యార్థితో ట్రెజరర్ మమతరాజశేఖర్‌రెడ్డి తదితరులు

**దుండిగల్, నవంబర్ 30 ప్రభాతవార్త:** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఎమ్మెల్లార్‌ఐటిఎం), ఫార్మాసీ (ఎమ్మెల్లార్‌ఐపి)కళాశాలలు సంయుక్తంగా సాంప్రదాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్బంగా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రదారణతో హాజరై సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ ఆటపాటలు, కోలాటాలతో సందడి చేశారు. తెలంగాణ వైభవానికి ప్రతీక నిలిచే బతుకమ్మ, బోనాలు, దసర పండుగలతో పాటు సంక్రాంతి, ఓనం, రంజాన్, క్రిస్మస్ పండుగలను జరుపుకున్నారు. ఈసందర్బంగా కళాశాల నిర్వాహకులు మాట్లాడుతూ దేశంలోని ఆయా రాష్ట్రాల సాంప్రదాయాలు, పండుగలు, వాటి ఔన్నత్యాన్ని విద్యార్థులకు తెలియజేయడం కోసం ప్రతి ఏటా సాంప్రదాయ దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని వారి ప్రదర్శనలతో ఆకట్టుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్లార్ గ్రూప్స్ అధినేత, అంతర్జాతీయ వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, ట్రెజరర్ మమతరాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ అనుశ్రేయరెడ్డి, డా.పి.శ్రీధర్, ఫార్మాసి ప్రిన్సిపాల్ డా.అర్నబ్‌మాలిక్, క్లబ్ 64 నిర్వాహకులు డా.స్రవంతి, విజయసింహా, అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేనేజర్ సునంద సేవలు అభినందనీయం : కౌన్సిలర్


మేనేజర్ సునందకు పుష్పగుచ్చం అందిస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ

**దుండిగల్, నవంబర్ 30 ప్రభాతవార్త:**
దుండిగల్ పురపాలికలో మేనేజర్‌గా నాలుగు సంవత్సరాల పాటు విశేష సేవలందించి పదవి విరమణ పొందుతున్న మేనేజర్ సునంద సేవలు అభినందనీయమని కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ అన్నారు. మేనేజర్ సునంద తన ఉద్యోగ బాధ్యతలు శనివారంతో ముగియనున్న నేపథ్యంలో మున్సిపల్ సమావేశ మందిరంలో పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగా కౌన్సిలర్లు, సహ ఉద్యోగులు, సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దుండిగల్ పురపాలికలో నాలుగేళ్ళ పాటు సాగిన తన ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమీషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు మహేందర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జక్కుల శ్రీనివాస్ యాదవ్, మురళియాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కమిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్


అధికారులతో నిర్మాణ పనులపై మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 30, ప్రభాతవార్త**
124 అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని మహాత్మా గాంధీ నగర్ లో యాభై లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న కమిటీ హాల్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శనివారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్బంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కమిటీ హాల్ నిర్మాణం నాణ్యత ప్రమాణాలతో చేపట్టి, వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీలో చిన్న చిన్న ఫంక్షన్లు జరుపుకోవడానికి, సమావేశాలు నిర్వహించుకోవడానికి కమిటీ హాల్ కాలనీ ప్రజలకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, గుడ్ల శ్రీనివాస్, పోశెట్టిగౌడ్, దనుంజయ్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పాలిట సిఎం రిలీఫ్ ఫండ్ వరం


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన కూన శ్రీశైలం గౌడ్

**పేట్ బషీరాబాద్, నవంబర్ 30, ప్రభాతవార్త**
నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరంలా మారిందని, ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్ వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన బి.వెంకటమ్మ,ఎన్.రాధికలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. రూ.51,000, రూ.40,000 చెక్కులను ఇద్దరికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శనివారం తన నివాసంలో అందించారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కి బాధిత మహిళ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు, నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ని తన నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతులు అందజేశారు. ఆయా సమస్యలు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. పలువురు పలు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొబ్బరంగారావు, దుగ్యాల సాయిప్రసాద్, రామచంద్ర రెడ్డి, ప్రవీణ్, రంగారావు, నవీన్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, బండి సాయి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాలలో సిసి కెమెరాలు ఏర్పాటు..


సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న సిఐ నరసింహ

**జగద్గిరిగుట్ట, నవంబర్ 30, ప్రభాతవార్త**
లెనిన్ నగర్ శ్రీ కాశీ విశ్వేశ్వర దేవస్థానం శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సీఐ నరసింహ పాల్గొని సీసీ కెమెరాలను ప్రారంభోత్సవం చేశారు. దేవాలయం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జ్యోతి నరసింహ తెలియజేయగా, కాలనీవాసుల సహకారంతో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని కమిటీ మెంబర్స్ తెలియజేశారు.

## నూతన మార్కెట్ కమిటీ ఛైర్మన్‌కు సన్మానం


నూతన మార్కెట్ కమిటీ ఛైర్మన్ నూనెముంతల విమల వెంకటేశ్ గౌడ్ దంపతులను సన్మానిస్తున్న మాజీ జెడ్పీటీసీ యాదగిరి, తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 30, ప్రభాతవార్త**
యాదాద్రి జిల్లా మోత్కూర్ మార్కెట్ కమిటీకి నూతన ఛైర్మన్‌గా నూనెముంతల విమల వెంకటేశ్ గౌడ్ ఎన్నికైన సందర్భంగా మాజీ జెడ్పీటీసీ కొలుకొండ యాదగిరి,హజ్ కమిటీ సభ్యుడు షార్పుదున్,దశరథ మార్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఆనంతరం విమల వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. నాపై నమ్మకం ఉంచి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి ఇచ్చినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ విఫ్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, యాదాద్రి అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, యాదగిరిగౌడ్‌లకు విమల వెంకటేశ్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు

## వరదనీటి కాలువ పనులను పరిశీలించిన కార్పొరేటర్

**చిక్కడపల్లి, నవంబరు 30 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్ వరదనీటి కాలువ పనులను స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ శనివారం పరిశీలించారు. అశోక్‌నగర్ స్ట్రీట్ నెంబరు 1, 2 కాలనీలోని అశోక్‌నగర్ నాలా వరద ముంపు రాకుండా నిర్మించిన రిటర్నింగ్ వాల్ వద్ద నీరు నాలలోకి వెళ్లేందుకు చేసిన చిన్నదారి నుంచి వరదనీరు కాలనీలోకి చేరుకుని తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఇంజనీరింగ్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారఉలతో సమస్యపై సమీక్షించిన అనంతరం 'ఫ్లాప్ వాల్ మిషనరీ'ని ఏర్పాటు చేశామని కార్పొరేటర్ వివరించారు. ఈ మిషినరీ ద్వారా నాలాలో వరదనీరు అధికమైనప్పుడు కాలనీలోకి చేరకుండా ఈ మిషనరీ పనిచేస్తుందని వివరించారు. ఎన్నో రోజులుగా ఎదురవుతున్న సమస్య పరిష్కారమైందని కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ కుమార్, జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహేష్, సిబ్బంది, కాలనీ వాసులు పూర్ణచందర్, జి.వెంకటరెడ్డి, ఎం.కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా 'ఆంజనేయస్వామికి మహా హారతి'


ఆంజనేయస్వామికి మహా హారతి'కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖ నటుడు బిత్తిరి సత్తి, చిత్రంలో సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఛైర్మన్ పుట్టి యాదగిరి తదితరులు

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త**
సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నగరంలో 'ఆంజనేయస్వామికి మహా హారతి' కార్యక్రమం వైభవంగా జరిగింది. హనుమాన్ చాలీసా, శ్రీరాముని శ్లోకాలు, పద్యాలు, పాటలతో, భజన పాటలతో యువతీ యువకులు, వయసుతో నిమిత్తం లేకుండా భారీ ఊరేగింపుగా పాల్గొని ఆంజనేయ స్వామికి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జనరల్ సెక్రటరీ, ఛైర్మన్ పుట్టి యాదగిరి మాట్లాడుతూ తాము, తమ సంస్థ సభ్యులు జీర్ణోద్ధరుణకు గురవుతున్న ఆలయాల సంరక్షణకు, పునరుద్ధరణకు విశేష సేవలందిస్తున్నామని, ఈ సమితి ఆధ్వర్యంలో ఇలాంటి మహత్తర కార్యక్రమం జరగడం అనందదాయకమన్నారు. సంస్థ అధ్యక్షులు టి.యామన్ సింగ్ మాట్లాడుతూ ప్రముఖ సినీ హాస్య నటుడు బిత్తిరి సత్తి, ఇతర ప్రముఖులు రాజకీయాలకతీతంగా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ కోశాధికారి కాశీబుగ్గ బాబన్న మాట్లాడుతూ ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొన్న యావన్మంది భక్తాదుల ఉత్సాహాన్ని చూసాక ఇలాంటి మరిన్ని మహత్తర కార్యక్రమాలు తమ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని సభికుల హర్షధ్వానాల మధ్య పేర్కొన్నారు.ఈ సందర్భంగా ముఖ టీవీ,సినీ నటుడు చేవెళ్ళ రవికుమార్ (బిత్తిరి సత్తి), ఇతర ప్రముఖులను పుట్టి యాదగిరి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తాదులకు, ప్రముఖులకు అంబర్‌పేట ప్రధానకార్యదర్శి జూపల్లి శ్రవణకుమార్ ప్రసాదాలను అందజేశారు.

# మణికొండలో ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ


మణికొండ క్వార్టర్స్‌లో జరిగిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో పాల్గొన్న స్వాములు, భక్తుల దృశ్యం

**నార్సింగి, డిసెంబర్ 15 ప్రభాతవార్త :** మణికొండ క్వార్టర్స్ లో శనివారం అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఉదయం 11.గంటల నుంచి సాయంత్రం 4.గంటల వరకు బండ్లగూడ క్వార్టర్స్ ప్రాంతం శబరిగిరీశుడి మహిమాన్విత భక్తిగీతాలాపనతో మారుమ్రోగింది. ఈ పూజా కార్యక్రమంలో వందలాది మంది అయ్యప్ప స్వాములు పాల్గొని భక్తి సాగరంలో మునిగి తేలారు. మణికొండ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వాములు కటిక నేలపై పవళిస్తూ, ఉదయం, సాయంత్రం చన్నీటి స్నానాలు చేస్తూ, ఖచ్చితమైన నియమాలను పాటిస్తూ మండల పూజలు చేస్తున్నారని తెలిపారు. కాలంతో సమానంగా పరుగులు తీస్తున్న నేటి రోజుల్లో యువకులు 40.రోజుల పాటు కఠినమైన నియమాలను పాటిస్తూ అయ్యప్ప మాలలు ధరించడం గర్వంగా ఉందన్నారు. ఆధ్యాత్మికతకు పుట్టినిల్లయిన మన దేశంలో యువత తిరిగి మన సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తుండడం శుభ పరిణామమన్నారు. పెద్దలంతా నిత్యం దేవాలయాలకు వెళ్తూ పిల్లలను సైతం వెంట తీసుకెళ్లాలని తెలిపారు. పెద్దలను చూసి చిన్నారులు నేర్చుకుంటారని పేర్కొన్నారు. అనంతరం జరిగిన అన్నదానంలో పెద్ద ఎత్తున భక్తజనం పాల్గొన్నారు. మణికొండ క్వార్టర్స్ వద్ద ఎక్కడ చూసినా అయ్యప్ప స్వాములు, భక్తజన సందోహమే కనిపించింది. కార్పోరేటర్లు, కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు భక్తులు పాల్గొని హరిహర తనయుడి కరుణా, కటాక్షాలకు పాత్రులయ్యారు.

## ఎయిడ్స్ మహమ్మారి బారిన పడకుండా జాగ్రత్త వహించాలి : గురుప్రకాశ్

**శేరిలింగంపల్లి,నవంబర్ 30 ప్రభాతవార్త**
ఎయిడ్స్ మహమ్మారి భారిన పడకుండా ప్రతివ్యక్తి అవగాహనతో జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర విశ్రాంత డిప్యూటి పారామెడికల్ అధికారి జి.గురుప్రకాశ్ అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని లేపాక్షి జూనియర్ కళాశాలలో విద్యార్థినీ,విద్యార్థులకు హెచ్‌ఐవి,ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర విశ్రాంత డిప్యూటి పారామెడికల్ అధికారి జి.గురుప్రకాశ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అతి భయంకరమైన వ్యాధులలో హెచ్‌ఐవి ఒకటన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాదిమంది ఎయిడ్స్ భారిన పడి ప్రతి ఏటా వేలాది మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. దీంతో ఆర్థిక నష్టంతో పాటు అకాల మృత్యువు భారిన పడుతున్నారన్నారు. నష్ట నివారణకోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 1న ఈ వ్యాధి వలన కలిగే అనర్థాలను,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచటం కోసం పనిచేస్తుందన్నారు.
ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధికి గల కారణాలు, వ్యాధి రాకుండా తీసుకో వాల్సిన జాగ్రతలను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ, విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జనార్థన్, అమ్మయ్య చౌదరి పాల్గొన్నారు.

## ఆరోగ్య సంజీవని సిఎంఆర్ఎఫ్ పథకం


చెక్కులను పంపిణీ చేస్తున్న ముఠాగోపాల్

**చిక్కడపల్లి, నవంబరు 30 ప్రభాతవార్త:**
సిఎంఆర్ఎఫ్ పథకం ఆరోగ్య సంజీవని అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గాంధీనగర్, ముషీరాబాద్, అడిక్‌మెట్ డివిజన్‌లకు చెందిన లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్, ముషీరాబాద్, కవాడీగూడ డివిజన్‌ల బిఆర్ఎస్ అధ్యక్షలు రాకేశ్‌కుమార్, కొండా శ్రీధర్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, బిఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, నేతలు ముఠానరేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ చిత్ర నిర్మాత రాకేశ్‌ను సత్కరించిన బిఆర్ఎస్ నేత రవీందర్‌యాదవ్



**శేరిలింగంపల్లి,నవంబర్ 30 ప్రభాతవార్త**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కేసీఆర్ సినిమాను తెరపైకి తీసుకువచ్చిన జబర్దస్త్ కమెడియన్,హిరో రాకేశ్ అభినందనీయులని బిఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్ అన్నారు. కేసీఆర్ పాలనను సినిమాగా చూపించిన తీరు అద్భుతమని కొనియాడారు. కేసీఆర్ సినిమా చిత్రాన్ని నిర్మించిన జబర్దస్త్ కమెడియన్, హిరో రాకేశ్‌ను సీనియర్ బీఆర్ఎస్ నేత రవీందర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. కేశ వ చంద్ర రమావత్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రాకేశ్ కేసీఆర్ పాలన తీరు తెన్నులను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. చిన్నచిన్న స్టేజ్ షోలతో కష్టపడి ఒక సినిమా నిర్మాతగా నటుడిగా మారి ఎంతో మందికి రాకేశ్ స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ అధికారం లోనికి వస్తుందని, రేవంత్‌రెడ్డిపాలనను చూపి ప్రజలు అసహ్యించుకుంటున్నారని, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు.


వార్త VAARTHA CLASSIFIEDS

SITUATION VACANT
★ Black Granite Block marker required for Andhra/Telangana. Good salary plus expenses.
kandoi@indiagranite.com
(Ro.No.32436)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## ఘనంగా స్పోర్ట్స్ మానియా ఛాంపియన్‌షిప్




**తుర్కయంజాల్ నవంబర్ 30ప్రభాతవార్త :** తుర్కయాంజాలలోని కేబీ స్కూల్ లో స్పోర్ట్స్ మానియా ఛాంపియన్‌షిప్ -2024ను ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు విద్యార్థులు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా పాఠశాల కరస్పాండెంట్ డి.ఆర్ సి.ఎన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఛాంపియన్‌షిప్‌లో పాఠశాల నాలుగు హౌస్ ల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, స్కూల్ కేబినెట్ మార్చ్ ఫాస్ట్ ను అద్భుతంగా నిర్వహించారని హై స్కూల్ విద్యార్థులు వెల్కమ్ టు కేబి అని ఫార్మేషన్ అద్భుతంగా చేశారన్నారు. కబడ్డీ ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఇంతకు ముందు క్రీడలలో భాగంగా క్రికెట్, వాలీబాల్ , ఖో ఖో, ట్రాక్ అండ్ ఫీల్డ్ వంటి క్రీడలలో గెలుపొందినవారికి పాఠశాల కరస్పాండెంట్ బహుమతి ప్రదానం చేశారు. స్పోర్ట్స్ మానియా ఛాంపియన్‌షిప్ 2024 విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల త్యాగం, కఠిన శ్రమకు మచ్చుతునకగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కరస్పాండెంట్ డాక్టర్ సిఎన్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. కేబీ స్కూల్ విద్యార్థుల శారీరక, మానసిక, సాంస్కృతిక అభివృద్ధిని పోషించే సమగ్ర విద్యను అందించడానికి కట్టుబడి ఉంది. స్పోర్ట్స్ మానియా ఛాంపియన్‌షిప్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులను జీవనంలోని అన్ని రంగాలలో ముందుండేలా ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత : ప్రిన్సిపల్



విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి దీపాలను వెలిగిస్తున్న ప్రిన్సిపల్ సురేష్ బాబు తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 30, ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని సాయి చైతన్య ప్రిన్సిపల్ చల్లగుల్ల సురేష్ బాబు పేర్కొన్నారు. ముసారంబాగ్ లోని కళాశాలలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపల్ చల్లగుల్ల సురేష్ బాబు ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యార్థులు అధ్యాపకుతో కలిసి ఆయన దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా అయ్యప్ప చిత్రాన్ని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించడంతో ఆధ్యాత్మిక భావనలు వెల్లివిరి సాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడంతో విద్యార్థులకు పండుగలు, వాటి విశిష్టత గురించి తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### జలమండలిలో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలి : పొల్కం శ్రీనివాస్

**మలక్ పేట ,నవంబర్ 30, ప్రభాతవార్త:** జలమండలిలో ఏ ఎం ఎస్ (అన్యువల్ మెయింటెనెన్స్ సిస్టం) టెండర్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, జలమండలి కాంట్రాక్టర్ జేఏసీ మీడియా ఇంచార్జ్ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ ఎం ఎస్ విధానాన్ని రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు. గత బి ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఏఎంఎస్ విధానం పూర్తిగా అవినీతి మయంగా మారిందని ఆరోపించారు. బి ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన పాలసీని ఇంకా కొనసాగించడం సరైనది కాదన్నారు. ఏ ఎం ఎస్ విధానాన్ని రద్దు చేయాలని జలమండలి ఎండికి పలువురు పేర్కొన్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు వెంటనే ఏ ఎం ఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### దిల్‌షుక్ నగర్ ఆర్టీసీ డిపోలో ఘనంగా కార్తీక వన భోజనాలు



వన భోజనాలలో పాల్గొన్న డిప్యూటీ ఆర్ఎంవోలు సుచరిత, జగన్ డిపో మేనేజర్ సమత ఉద్యోగస్తులు తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 30, ప్రభాతవార్త :** దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపోలో కార్తీక వనభోజనాలను ఘనంగా నిర్వహించారు. అధికారులు ఉద్యోగులు డ్రైవర్లు కండక్టర్లు సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంవోలు సుచరిత, జగన్, డిపో మేనేజర్ సమతలు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడంతో ఉద్యోగుల మధ్య ఐక్యత పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటి వెంకన్న, ఎమ్ ఎఫ్ వెంకటేష్ , ఎడిసిలు ఎంవిఎన్ రావు , సోలిపురం బుచ్చిరెడ్డి , ఏఎస్ రెడ్డి, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### జలమండలి ఎండితో కాంగ్రెస్ ఇంచార్జీ పరమేశ్వర్‌రెడ్డి బేటి



జలమండలి ఎండి అశోక్‌రెడ్డితో బేటి అయిన కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 30 ప్రభాతవార్త :** జలమండలి ఎండి అశోక్‌రెడ్డితో శనివారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, అభివృద్ధి పనులకు రూ.16.63 కోట్లు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. త్వరలోనే మంత్రుల చేతుల మీదుగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఉప్పల్, రామంతాపూర్‌లలో మంచినీరు, డ్రైనేజీ పనుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉప్పల్ భగాయత్‌లో రూ.6.81 కోట్లతో మంచినీరు, డ్రైనేజీ పనులు, భగాయత్ ఫేజ్ -1లో రూ.4 కోట్లతో సివరేజీ పైప్‌లైన్ పనులు, పద్మావతికాలనీ, ఆనంద్‌నగర్, సెవెన్‌హిల్స్‌లలో రూ.3.98 కోట్లతో సివరేజీ పనులు, రామంతాపూర్ ఇందిరానగర్‌లో రూ.68లక్షలతో ఆర్‌సిసి సివరేజీ లైన్లు, స్వరూప్‌నగర్‌లో రూ.60లక్షలతో సివరేజీ పైప్‌లైన్లు, రామంతాపూర్ భగాయత్‌లో రూ.18.50 లక్షలతో రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద సివరేజీ లైన్ల నిర్మాణం, రూ.31 కోట్లతో కేటీఆర్‌నగర్‌లో మంచినీరు,సివరేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం : ఎమ్మెల్యే అహ్మద్ బలాల



సలీంనగర్ లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల ,కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 30, ప్రభాతవార్త:** మలక్ పేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ముసారాంబాగ్ డివిజన్ లోని పలు ప్రాంతాలలో డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తో కలిసి ఎమ్మెల్యే అహ్మద్ బలాల రూ 1.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ముసారాంబాగ్ డివిజన్ లో ఇప్పటివరకు కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించడానికి ప్రణాళికలను రూపొందిం చనునట్లు తెలిపారు. అదేవిధంగా డివిజన్ లోని శ్రీపురం కాలనీ ఇండోర్ స్టేడియం లో డివిజన్ లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనుల గురించి అధికారులు, స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే బలాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఇ శంకర్ , ఏ ఎం హెచ్ ఓ అనురాధ, నాయకులు కనుక రవీందర్ రెడ్డి, బొక్క మధుసూదన్ రెడ్డి, కృష్ణారెడ్డి , హబీబ్ ఉర్ రెహమాన్, షేక్ ఫహాద్ హుస్సేన్, తౌసిఫ్ మోహియుద్దీన్, ఇలియాస్, నజీమా పాల్గొన్నారు.

## బి.యన్.రెడ్డి నగర్ లో 22 ఎ జిఓను తొలగించి న్యాయం చేయాలి : బాధిత ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు పురుషోత్తం రెడ్డి

**వనస్థలిపురం. నవంబర్ 30.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి. నగర్ డివిజన్ లోని రిజిస్ట్రేషన్ లకు సంబంధించిన జి.ఓ. 118 ను సవరించి,జి.ఓ. 22ఏ ను తొలగించి న్యాయం చేయాలని బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ 118 జి.ఓ. బాధితుల ఐక్య వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు కడుతూ జీవనం సాగిస్తున్నామని,అకస్మాత్తుగా 2007 లో ఇది ప్రభుత్వ భూమి అని ,ఎలాంటి కారణం చెప్పకుండా రిజిస్ట్రేషన్ లు నిలిపి వేశారన్నారు. దీంతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులను,ప్రభుత్వానికి తమకు న్యాయం చేయాలని వినతిపత్రాలు సమర్పించమన్నారు. గత బి.ఆర్.ఎస్. ప్రభుత్వం సమస్య పరిస్కారానికి 118 జి.ఓ.ఇచ్చారన్నారు. దీంతో కన్వేయన్స్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ లు జరుగుతాయని ఆశపడ్డామన్నారు. అయితే కన్వేయన్స్ డీడ్ ద్వారా కేవలం ఖాళీ ప్లాట్ కె రిజిస్ట్రేషన్ లు వర్తించాయి. ఇండ్లు ఉన్న వారుకి ఎలంటూ ప్రయోజనం చేకూరలేదు.118 జి.ఓ. ద్వారా తమ స్వంత ప్లాట్ లు ,ఇండ్లు ప్రభుత్వ స్థలాలుగా మారడం తో ,గజాని కి 250 రూపాయలు చెల్లించినప్పటి కి రిజిస్ట్రేషన్ లు కాకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. కన్వేయన్స్ డీడ్ కు చట్టబద్ధత లేనందున జాతీయ బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 22ఏ జి.ఓ.ను రద్దుచేసి తమకు న్యాయం. చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రతినిధులు దామోదర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,మహేందర్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.

## వాజ్‌పేయినగర్ ఆర్‌యూబి నిర్మాణం త్వరగా చేపట్టాలి : ఎమ్మెల్యే



ఆర్ అండ్ బి ఇంజనీర్ ఇన్ చీఫ్ మదుసూధన్ రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**నేరెడ్‌మెట్,నవంబర్30,ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని వాజ్‌పేయినగర్ ఆర్ యూబి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ఆర్ అండ్‌బి ఇంజనీర్ ఇన్ చీఫ్ మదుసూధన్ రెడ్డికి బి.ఆర్.ఎస్ నాయకులతో కలసి ఎమ్మెల్యే వినతి పత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వాజ్‌పేయినగర్ రైల్వే గేటు 10ని.లకు ఒక్కసారి రైలు ద్వారా మూసివేస్తుండడంతో ఆ ప్రధాన రహదారి గుండా ప్రయాణిస్తున్న వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైళ్ళ సర్వీసు ఎక్కువగా ఉండడం కారణంగా ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు. ఆ సమస్యలపై తనకు ఎన్నోసార్లు సంబంధిత కాలనీల నుండి వినతి పత్రాలు సైతం వచ్చాయన్నారు. ప్రజల ఇబ్బందులు, మౌళిక వసతుల రూపకల్పనను దృష్టిలో పెట్టుకొని వాజ్‌పేయి నగర్ ఆర్‌యూబి నిర్మాణం పై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసి చైర్మన్ నందికంటి శ్రీధర్, సీనియర్ నాయకులు బద్దం పరుశరామ్ రెడ్డి, రాము యాదవ్ పాల్గొన్నారు.

## కార్తిక మాసం ఎంతో పవిత్రమైంది : ఎమ్మెల్యే అరికపూడి గాంధీ



కార్తీక వన భోజన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు తధితరులు

**తార్నాక, నవంబర్ 30 ప్రభాతవార్త:** కార్తిక మాసం ఎంతో పవిత్రమైందని, ఈ మాసంలో నిర్వహించే వనభోజనాలు ప్రేమ ఆత్మీయతో కూడుకుంటాయని ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు పేర్కోన్నారు. తార్నాక కమ్మవారి సేవా సంఘం ఆద్వర్యంలో శనివారం తార్నాకలోని మర్రి చెన్నారెడ్డి హాల్లో సందడిగా కార్తీక వనభోజన ఆత్మీయ సమ్మేళన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు పండుగ వాతావరణంలో శివుడికి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి, భారతీయం సత్యవాణి, టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జెట్టి కుసుమ్ కుమార్, డా. లావు నరేంద్ర నాథ్, గూడురు సత్యనారాయణ మాట్లాడుతూ తార్నాక కమ్మవారి సేవా సంఘం వారు చేస్తున్న వివిద సామాజిక కార్యక్రమాలు ఎంతో గొప్పవని వారు అందరికి ఆదర్శం అన్నారు. సీఎం చంద్రబాబునాయుడును జగన్ కక్షపూరితంగా జైలుకు పంపించిన సమయాల్లో నగరంలో తార్నాక కమ్మవారు ఆందోళనలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ కొత్తరామారావు, తార్నాక కమ్మవారి సేవా సంఘం అధ్యక్షులు వల్లభనేని వీర భద్రయ్య, ఉపాధ్యక్షురాలు మన్నే నగమల్లేశ్వరీ, ప్రధాన కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు, సంఘం ప్రతినిధులు తలశిల సీతా రామయ్య, కిలారు రమేష్, గొర్రెపాటి జగదీశ్వరరావు, కావూరి నరసింహ్మా రావు, అడుసుమిల్లి చిట్టి వీరయ్య, మాదల రాధా కృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

### పల్లవి మోడల్ స్కూల్లో 28వ వార్షిక క్రీడా దీనోత్సవ వేడుక



వార్షిక క్రీడోత్సవంలో లో పాల్గొన్న విద్యార్థులు ఇతరులు

**తార్నాక, నవంబర్ 30 ప్రభాతవార్త:** క్రీడలు ఏకాగ్రత, లక్ష్యాన్ని పెంపొందించుకునేందుకు ఎంతో దోహదపడుతాయని పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ మల్కా కొమురయ్య పేర్కోన్నారు. పల్లవి మోడల్ స్కూల్లో 28వ క్రీడాదినోత్సవ వేడుకలు ఎంతో సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మల్కా కొమురయ్య, తెలంగాణ స్టేట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణకుమార్ మహేశ్వరి, కరాటే కోచ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ రమేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరం అన్నారు. శారీరక దృడత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించి క్రీడల్లో ఎంతో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బోయిన్‌పల్లి ప్రిన్సిపల్ రేణు చక్రవర్తి, వైస్ ప్రిన్సిపల్ పూజా సక్సేనా, రీతూ సింగ్, ఆకుల రజిని తధితరులు బహుమతులను అందజేశారు. ఈ సంవత్సరం రోలింగ్ ట్రోఫిని గోదావరి హైస్ ప్రథమ స్థానంలో, కావేరి హౌస్ ద్వితియ స్థానంను కైవసం చేసుకున్నారు.

### ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో న్యాక్ విజయోత్సవ వేడుక



సక్సెస్ మీట్ కార్యక్రమంలో పాల్గొన్న బ్రదర్ అరుణ్‌ప్రకాష్, బ్రదర్ జాన్, జయంతిరెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 30 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపు లభించిన సందర్భంగా శనివారం కళాశాలలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రెవ.బ్రదర్ అరుణ్ ప్రకాష్, కరస్పాడెంట్ రెవ.బ్రదర్ జాన్, డైరెక్టర్లు, ప్రిన్సిపల్ జయంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కళాశాలకు న్యాక్ గుర్తింపు రావడంతో తమపై మరింత భారం పెరిగిందన్నారు. కళాశాల బాధ్యతతో విద్యాబోధన చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. అటానామస్‌కు వెళ్లాలని, విద్యాబోధనలో అధునాతన పద్దతులను అనుసరించి ఉన్నత శిఖరాలకు చేరాలని వారు ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఎసి కోఆర్డినేటర్ ప్రశాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్‌బాబు శ్రీకారం

**సరూర్‌నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జల్‌పల్లి మున్సిపాలిటీలలో నూతనంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శనివారం రాష్ట్ర ఐటి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శ్రీకారం చుట్టారు. మహేశ్వరం నియోజకవర్గంలో పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి, కాంగ్రెస్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, తెలంగాణ రాష్ట్ర టియుఎఫ్‌డిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డితో పాటు పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సుల్తాన్‌పూర్ సమీపంలోనున్న ఆర్‌సిఐ క్రాస్ రోడ్స్ నుండి పహాడీషరీఫ్ బైపాస్ రోడ్డులోని శ్రీశైలం రహదారి వరకు రూ.3.20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు విస్తరణ, బిటి రోడ్డు నిర్మాణపు పనులకు శ్రీకారం చుట్టారు. అదే విధంగా జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో పదిహేనవ ఆర్థిక సంఘం నిధులు రూ.143.00 లక్షలతో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాల్య సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, బడంగ్‌పేట్ కమీషనర్ పి.సరస్వతి, జల్‌పల్లి కమీషనర్ వెంకటరామ్, పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్,బిఆర్ఎస్,ఎంఐఎం నాయకులు, పాల్గొన్నారు.

### మహేశ్వరం నియోజకవర్గ బిఎస్‌పి అధ్యక్షుడిగా బహుగుణ

**సరూర్‌నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:** మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ నూతన అధ్యక్షునిగా బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ శ్రీహిల్స్ కాలనీకి చెందిన కేతావత్ బహుగుణ నాయక్ నియమితులయ్యారు. బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షునిగా గతంలో ఉన్న గుడ్ల శ్రీనివాస్ పార్టీకి, పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాలీగా ఉంది. అయితే ఈ నియోజకవర్గ బిఎస్‌పి అధ్యక్షునిగా బహుగుణను నియమిస్తూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తనను నియమించిన వారికి, సహకరించిన వారికి బహుగుణ కృతజ్ఞతలు తెలిపారు.

## విజయోత్సవాలను జయప్రదం చేయాలి

**-చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రామ్ రెడ్డి**



**తుర్కయంజాల్, నవంబర్30.ప్రభాతవార్త :** మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ వార్డు కార్యాలయంలో శనివారం చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాంరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు.డిసెంబర్ 1వ తేదీ నుండి 9వ తేదీ వరకు జరుగుతున్న ప్రజాపాలన విజయోత్సవాలను జయప్రదం చేయాలని ఈ సమావేశంలో పాలకమండలి 9 రోజులు నిర్వహించవలసిన కార్యక్రమాన్ని చర్చించి సూచనలు చేశారు. ప్రజా సౌచలాయాలను, శుభ్రపరచుట, ప్రభుత్వ పాఠశాలలు , అంగన్వాడీలు, ప్రభుత్వ కార్యాలయాలు, శుభ్రపరచడం, ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీ హెల్త్ క్యాంపు, నీటి వలరులను శుభ్రపరచుట, సంస్కృతిక కార్యక్రమాలు రక్షక పరికరాల పంపిణీ, పరిశుద్ధ సిబ్బందికి సన్మానం వంటి కార్యక్రమాలు ఉన్నట్లు పుర కమిషనర్ అమరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ హరిత ధనరాజ్ గౌడ్, కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు, పుర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా రాజు

**నేరెడ్‌మెట్,నవంబర్30,ప్రభాతవార్త:** మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా బండి రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా ఉన్న సంగి రమేష్ మాట్లాడుతూ 2018 నుండి 2024 సంవత్సరం వరకు పొలిటికల్ సైన్స్ అధ్యాపకులుగా సేవలందించి, ఎంతోమంది విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చి దిద్దిన బండి రాజు ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషకరమన్నారు. కళాశాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి, ఆగస్టులో జరిగిన సాధారణ బదిలీల్లో ఎబివి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీపై వెళ్ళి తిరిగి పదోన్నతిపై మల్కాజిగిరి ప్రిన్సిపల్‌గా రావడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పదవి విరమణ పొందిన పోలీసులకు సత్కారం



పదవి విరమణ పొందిన పోలీసు అధికారులు..

**నేరెడ్‌మెట్,నవంబర్30 ప్రభాతవార్త:** పోలీసు ఉద్యోగం ఎంతో బాద్యతాయుతమైనదని, 24గంటలు ప్రజలకు సేవ చేస్తుండాలని డీసికి క్రైమ్స్ అరవింద్ బాబు అన్నారు. రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు ఆధ్వర ంలో రాచకొండ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో పనిచేసి పదవి విరమణ పొందిన కంట్రోల్ రూమ్ ఎస్సై పోచయ్య, సీసీఆర్‌బి ఎస్సై ప్రభులింగం, సీసీఎస్ ఎల్బీనగర్ ఏఎస్సై ఆర్. భరత్, భువనగిరి హెడ్ క్వార్టర్స్ హెడ్ కానిస్టేబుల్ మహ్మద్ సాదిక్‌లను డీసిపి క్రైమ్స్ అరవింద్ బాబు సన్మానించి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో సమర్థవంతంగా పనిచేసి వారి సేవలను అందించినందుకు వారిని అభినందించారు. పదవి విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని సంతోంగా గడపాలని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలన్నారు. పోలీసు శాఖ నుండి వారికి రావాల్సిన ప్రయోజనాలను త్వరగా వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఏవో అకౌంట్స్ సుగుణ, ఏసిపి సీసీఆర్‌బి రమేష్, ఎస్టేట్ ఆఫీసర్ నాయుడు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు భద్రారెడ్డి, క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

### అన్నిపండుగలను కలిసికట్టుగా జరుపుకోవడం సంతోషదాయకం : ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి



గ్యార్వీషరీఫ్ వండుగలో ఛైర్మన్, పాలకవర్గసభ్యులు, ఉద్యోగులు

**హయత్‌నగర్, నవంబరు 30 ప్రభాతవార్త:** సంస్థ ఉద్యోగులంతా కులమతాలకు అతీతంగా అన్ని పండుగలను కలిసికట్టుగా జరుపుకోవడం సంతోషంగా ఉందని మదర్‌డెయిరీ ఛైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని మదర్‌డెయిరీ ఆవరణలో శనివారం గ్యార్వీషరీఫ్ పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఛైర్మన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ... మదర్‌డెయిరీలో పనిచేస్తున్న కార్మికులు వేరువేరు కులాలు, మతాలకు చెందిన వారైనప్పటికీ భోనాలు, వినాయకచవితి, గ్యార్వీషరీఫ్ వంటి పండుగలను కలిసిమెలిసి జరుపుకోవడం కార్మికుల ఐకమత్యాన్ని తెలుపుతోందన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికులంతా ఐక్యంగా ఉంటూ సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.కృష్ణ, పాలకవర్గ సభ్యులు, యూనియన్ ప్రతినిధులు కె.ఉమామహేశ్వర్‌రెడ్డి, సయ్యద్ అహ్మద్, ఎస్.మహిపాల్‌రెడ్డి, శ్రీనివాసరాజు, ఖలీల్, మహ్మద్ జానీపాషా పాల్గొన్నారు.

### విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడిగా బిక్షపతి-చారి

**ఉప్పల్, నవంబరు 30 ప్రభాతవార్త :**

హైదరాబాద్ జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాత్ర సంఘం అధ్యక్షులుగా రామంతాపూర్‌కు చెందిన పబ్బోజు బిక్షపతిచారి నియమితులైయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్, లాలుకోట వెంకటచారి, పులిగిల్ల శ్రీనివాసాచారిల నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రేటర్ విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ మాత్ర సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సంఘం బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని, పంచదాయ వృత్తుల వికాసం, అభున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నారోజు జగ్జీవన్‌చారి, జిల్లా కార్యదర్శి పెద్దకొలిమి బ్రహ్మచారి, మారేడుపాక రమేష్, దేవాలయ కమిటి నేతలు కృష్ణమాచార్యులు, రాగిపణి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా సురేష్‌బాబు నియామకం

**హయత్‌నగర్, నవంబరు 30 ప్రభాతవార్త:** హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా డా.పి.సురేష్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకులుగా పనిచేసిన ఆయన పదోన్నతిపై హయత్‌నగర్ కళాశాల ప్రిన్సిపలగా నియమితులయ్యారు. కళాశాల సిబ్బంది ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ... అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సహకారంతో కళాశాల అభివృద్ధి కోసం శక్తిమేరకు తోడ్పాటును అందిస్తానని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్‌గా అదనపు బాధ్యతలతో పనిచేస్తున్న ప్రసాదని ప్రిన్సిపల్, సిబ్బంది సన్మానించారు.

## ఫుడ్‌పాయిజన్‌పై ప్రభుత్వం స్పందించాలి




హయత్‌నగర్‌లోని జడ్పీహెచ్ఎస్ ముందు విద్యార్థి సంఘాల ఆందోళన

**హయత్‌నగర్, నవంబరు 30 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్, ఇతర సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు వంశీవర్ధన్‌రెడ్డి, గుండెశివ, మహేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యను పరిరక్షిస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ, గురుకులాల్లో కొనసాగుతున్న ఫుడ్‌పాయిజన్ సమస్యపై స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. పదుల సంఖ్యలో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని, వందల సంఖ్యలో విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని లేనిపక్షంలో విద్యార్థి లోకాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అరుణ్‌కుమార్‌గౌడ్, వినోద్, వెంకటేష్, ఉపేందర్, భానుప్రకాష్, శివ, వంశీ, సాయి పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు చిలుక సత్కారం



స్వాములను సత్కరిస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:** శబరిమల యాత్రకు కాలినడకన వెళ్లి అయ్యప్పస్వామిని దర్శనం చేసుకుని వచ్చిన అయ్యప్పస్వామి భక్తులకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి సత్కారం చేశారు. హైదరాబాద్ నుంచి శబరిమల వరకు కాలినడకన వెళ్లి అయ్యప్ప దర్శనం చేసుకొని తిరిగి వచ్చిన యాల్గాస్కంపేట్ మహేష్ స్వామిని ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలోని చిలుక నివాసంలో పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మామిడి రామకృష్ణగౌడ్, పెద్దవూర సైదులు, పగడాల శ్రీశైలం, శివ, వట్టికోటి అనిల్, ప్రశాంత్, అనుదీప్, క్రాంతిరెడ్డి పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో శ్రీఅమరలింగేశ్వర దీపాలంకరణ

**ఎల్.బి.నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:**

కార్తీక మాసము చివరి శుక్రవారం సందర్భంగా న్యూమారుతీనగర్ నార్త్ రోడ్‌నెంబర్ 4లో శ్రీఅమరలింగేశ్వర సహిత శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానములో దీపాలంకరణ కార్యక్రమం ఫణిందర్‌శర్మ, ఆలయ చైర్మన్ ముజకారి భాస్కర్, ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక మాస వనభోజనం కార్యక్రమంలో సుమారు మూడు వేలమందికి అన్నప్రసాదం అందజేశారు. దీక్షలో ఉన్న పలువురు అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొని పరమశివుడికి దీపాలు వెలిగించి ఆలయదర్శనము చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, న్యూమారుతీనగర్ అసోసియేషన్ సభ్యులు నరేందర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ బి.విజయరంగ, జగదీష్, జ్యోతి, అభిలాష్, దీపక్, వీరేశం, వీరనారాయణ, లక్ష్మణ్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు పంపిణీ చేస్తున్న సుధీర్‌రెడ్డి, అరుణసురేందర్ యాదవ్

**ఎల్.బి.నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో నాగోల్ డివిజన్ పరిధిలోని లబ్దిదారులకు 1.16 లక్షల కళ్యాణలక్ష్మి చెక్కులను శనివారం ఎంఎల్ఏ, కార్పొరేటర్‌లు లబ్దిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెళ్ళిపందిరిలోనే చెక్కులను ఇచ్చే పద్ధతి ఉంటే పేదలు మరింత సంతోషిస్తారని అన్నారు. పెళ్ళిపందిరిలోనే చెక్కులు అందేలా చూడాలనీ ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం ఇస్తామన్న ముఖ్యమంత్రి ఇపుడు ఆ ఊసే ఎత్తడం లేదని, ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఇంకా ఇచ్చిన 6 గ్యారంటీలను నెరవేర్చలేదన్నారు.

### మీర్‌పేట్ కార్పొరేషన్‌లో కార్మికులకు, ఉద్యోగులకు వైద్య పరీక్షలు

**సరూర్‌నగర్, నవంబర్ 30 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం బాలాపూర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కార్మికులకు, ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది వారికి బిపి, షుగర్, సిబిపి, లిపిడ్ ప్రొఫైల్, హెచ్‌బి ఎవిసి, సిఆర్‌పి, విటమిన్ బి 12, డి 3, థైరాయిడ్, యూరిక్ యాసిడ్ కాల్షియం తదితర పరీక్షలను నిర్వహించారు. ఈ వైద్య పరీక్షల శిబిరాన్ని కమీషనర్ జ్ఞానేశ్వర్, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డిలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనిధి, హెల్త్ అసిస్టెంట్ అజయ్, స్టాఫ్ నర్సు మంగ, ల్యాబ్ టెక్నీషియన్ సమీనా, వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు.

### తెలంగాణలో టిడిపి బలోపేతానికి కృషి : అశోక్‌గౌడ్

**ఉప్పల్, నవంబరు 30 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని మల్కాజిగిరి పార్టీ కన్వీనర్ కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం చిలుకానగర్‌లో టిడిపి పార్టీ పార్లమెంట్ కన్వీనర్ కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్, అడ్‌హక్ కమిటి కన్వీనర్ డా.అంతగల్ల అశోక్ ఆధ్వర్యంలో పలువురు నేతలు పార్టీలో చేరారు.అనంతరం టిడిపి పార్టీ సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నేతలు ఇమామ్, శంకర్, అంజయ్య పాల్గొన్నారు.